క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

అచ్చంపేట రూరల్: ప్రయాణికుల సౌకర్యార్థం అన్ని రూట్లలో ఆర్టీసీ బస్సులను నడిపిస్తామని అచ్చంపేట ఆర్టీసీ డీఎం రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రయాణికుల సలహాలు, సూచనలను సెల్ నంబర్ 9959226291కు కాల్ చేయాలని కోరారు.

విద్యార్థికి ఎమ్మెల్యే సన్మానం



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రానికి చెందిన జనుంపల్లి రాజశేఖర్, రజిత దంపతుల కుమార్తె సాత్విక తెలంగాణ ఎంసెట్‌లో 2005 ర్యాంకు సాధించింది. గురువారం కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి విద్యార్థిని పూల మాల, శాలువాతో సన్మానించారు. రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు నాగరాజు, రాజేందర్‌గౌడ్, చంద్రయ్య, రాంలాల్ పాల్గొన్నారు.

సీసీరోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

వెల్దండ: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ విజయ, వైస్ ఎంపీపీ శాంతి పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలోని ఆయా గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణానికి రూ.35 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. శుక్రవారం ఎమ్మెల్యే హాజరై పనులు ప్రారంభిస్తారని చెప్పారు.

'మిగులు భూమిలో చెట్లపెంపకం ఆపండి'

బిజినేపల్లి: వట్టెం జలాశయ నిర్మాణం కోసం భూమి కోల్పోయిన రైతుల పొల్లాలో జలాశయం బండింగ్‌కు, రోడ్డు పోను మిగిలిని భూమిలో హరితహారం పథకం కింద చెట్లు నాటాలని చేసిన ప్రతిపాదనను అధికారులు నిలిపివేయాలని వట్టెంకు చెందిన భూ నిర్వాసితులు గురువారం డీఆర్‌డీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ప్రాజెక్టులో రెండోసారి భూములను రైతులు కోల్పోకుండా చూడాలని, ఈ విషయమై ఇప్పటికే కోర్టును ఆశ్రయించినట్లు కేసు వివరాలను రైతులు మాధవరెడ్డి, రమాదేవి, శ్రీశైలం, శ్రీను, భాస్కర్ తమ వినతిపత్రంలో పేర్కొన్నారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



బల్మూర్: మండలంలోని తుమ్మెన్‌పేట, బల్మూర్ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం తహసీల్దార్ కిష్టానాయక్, ఎంపీడీఓ దేవన్న, సీఈఓ రాజవర్ధన్‌రెడ్డి పరిశీలించారు. కేంద్రానికి వచ్చిన వడ్లను సరైన తేమ శాతం పరిశీలించి జాప్యం లేకుండా తూకాలు చేసి రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు.

అన్ని రంగాల్లో సముచిత స్థానం కావాలి

మన్ననూర్: మేము ఎంతో, మాకు అంత అన్నట్లుగా అన్ని రంగాల్లో వాటా కల్పించాలని యాదవ సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం మన్ననూర్ యాదవ గ్రామ కమిటీ అధ్యక్షుడు సురేష్ యాదవ్ సమక్షంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా అన్ని రంగాల్లో యాదవులకు సముచిత స్థానం కల్పించుకునే విధంగా భవిషత్‌లో అడుగులు వేయాలన్నారు. ఉమ్మడి అమ్రాబాద్ మండలంలోని ఆయా గ్రామ సంఘాల అధ్యక్షులు కృష్ణ యాదవ్, అంజియాదవ్, తిరుపతి యాదవ్, బాలయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రపెంటలో చెంచులకు వైద్యపరీక్షలు



లింగాల: మండలంలోని ఎర్రపెంటలో జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు గురువారం ఐటీడీఏ ఆధ్వర్యంలో చెంచులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. వైద్యులు దీపక్‌రాయ్, రాజీవ్, చందూ, అనిల్, ప్రశాంత్ 135 మందికి పరీక్షలు చేశారు. 31 మంది పిల్లలు, ఆరుగురు గర్భిణులు ఉన్నారని చెప్పారు. డివిజన్ ఉప మలేరియా అధికారి అశోక్ ప్రసాద్, పర్యవేక్షకులు వెంకటమ్మ, పల్లవి, ఉమా, ఎల్టీ నాగరాజు పాల్గొన్నారు.

తూకంలో మోసపోతున్న అన్నదాత

- కొనుగోలు కేంద్రాల్లో ఇష్టారాజ్యం
- రెండు రోజులుగా నిలిచిన ధాన్యం కొనుగోళ్లు
- పట్టించుకోని అధికారులు



మాచుపల్లిలో నిల్వ ఉన్న వరిధాన్యం

కోడేరు: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకంలో జరుగుతున్న మోసాన్ని అరికట్టే వారు కరువయ్యారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తూకంలో మోసాలను అరికట్టాల్సిన తూనికల అధికారులు మండలం వైపు కన్నెత్తి చూడటం లేదని ఆరోపిస్తున్నారు. నెల రోజులుగా జరుగతున్న మోసాలతో నష్టపోతున్న రైతులను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తూకంలో మోసం చేస్తున్నారు..

మండలంలోని ఐకేపీ ప్రాథమిక సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు తూకంలో కాంటా కొడుతున్నారు. ప్రభుత్వం 40 కిలోల చొప్పున ధాన్యం సంచులను సరఫరా చేస్తుంది. దీని ప్రకారం తూకం వేయాల్సి ఉంటుంది. గన్నీ బ్యాగు బరువు 600 గ్రాములు ఉంది. ఈ లెక్కన తూకం సమయంలో బస్తాతో కలిపి 40 కిలోల 600 గ్రాములు ఉండాలి. కానీ కేంద్రాల్లో 61 కిలోల చొప్పున ధాన్యం తూకం చేస్తున్నారు. ఈ లెక్కన క్వింటాలుకు రెండు కిలోల నుంచి నాలుగు కిలోల వరకు రైతుల నుంచి మిల్లర్లు దోచుకుంటున్నారు. అన్ని కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ కాంటాలు ఏర్పాటు చేసి బహిరంగంగానే తూకంలో మోసం చేస్తున్నా.. అడిగేవారు లేకపోవడంతో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా కొనుగోలు జరుపుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేసినందుకు హమాలీ భారం రైతులు భరించాల్సి వస్తుంది. తప్పనిసరి పరిస్థితుల్లో కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యం అమ్ముకునేందుకు రైతులు ఈ భారం మోస్తున్నారు.

నిలిచిన కొనుగోళ్లు..

మండలంలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటికే మందకొడిగా కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ధాన్యం కొనుగోలు నిలిపివేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రాల వద్ద ఎన్ని రోజులు ధాన్యం కాపాడుకోవాలని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తూకంలో మోసం చేయకుండా చూడాలని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులను రైతులు కోరుతున్నారు.

బహిరంగంగానే దోపిడీ..

దోపిడీ అంతా బహిరంగంగానే జరుగతుందని అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. క్వింటాలుకు మిల్లర్లు మూడు నుంచి నాలుగు కిలోల వరకు తీస్తున్నారు. హమాలీ చార్జీలు కూడా మీద పడుతున్నాయి. మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి.

– కిష్టయ్య, రైతు

తనిఖీ చేయని అధికారులు

ప్రభుత్వం అధికారుల నిర్లక్ష్యంతో కొనుగోలు కేంద్రాల్లో రైతుల కష్టాన్ని దోచుకుంటున్నారు. కేంద్రాలను తనిఖీ చేయాల్సిన అధికారులు.. అటువైపు కన్నెత్తి చూడటం లేదు. మిల్లర్లు కుంటి సాకులతో నాలుగు కిలోల వరకు కటింగ్ పెడుతున్నా.. చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– రాజు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు

అభివృద్ధే ప్రధాన ధ్యేయం



జిన్‌కుంటలో పూజ చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

అచ్చంపేట రూరల్: ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేర్చడమే తన ధ్యేయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. నల్లమల ప్రాంతం ఎంతో ఆధ్యాత్మికతతో ఉందని, మహిమ గల శైవ క్షేత్రాలు ఎన్నో ఉన్నాయన్నారు. మత సామరస్యానికి ప్రతీకగా రంగాపూర్ నిరంజన్‌షావలి దర్గా, శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రం లాంటివి ఉన్నాయన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు అధికంగా వస్తుంటారన్నారు. అచ్చంపేట చరిత్రలో ఆలయాల నిర్మాణాలకు జీఓ నంబర్ 205 ద్వారా రూ.30 కోట్ల నిధులు మంజూరుతో అభివృద్ధి చేపడుతామన్నారు. అచ్చంపేటలో అయ్యప్ప దేవాలయం కోసం రూ.కోటి, సేవాలాల్ మందిరం నిర్మాణానికి రూ.కోటి, పిరమిడ్ నిర్మాణానికి రూ.20 లక్షలు, అన్ని మండలాల్లో మహిళా భవనాల కోసం ఒక్కో భవనానికి రూ.50 లక్షలు, కమ్యూనిటీ భవనాలు, రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు గానూ ప్రభుత్వం ద్వారా రూ.30 కోట్లు మంజూరు చేస్తూ బుధవారం జీఓ జారీ చేసినట్లు చెప్పారు. మంజూరైన అభివృద్ధి పనులు త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. పనులు నాణ్యతగా చేపట్టి భవిష్యత్ తరాలు గుర్తించుకునేలా చేస్తామన్నారు. అన్ని హంగులతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను నిర్మిస్తామన్నారు. బల్మూర్ ఎంపీపీ అరుణ, లోక్యానాయక్, నర్సయ్యయాదవ్, రాజిరెడ్డి, గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

జిన్‌కుంట ఆలయంలో ప్రభుత్వ విప్ ప్రత్యేక పూజలు

బల్మూర్: మండలంలోని జిన్‌కుంటలో నూతనంగా నిర్మించిన శ్రీరామచంద్ర, ఆంజనేయస్వామి ఆలయాన్ని గురువారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సందర్శించారు. ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాల్లో ఆలయాల నిర్మాణాలకు కలిసికట్టుగా ప్రాధాన్యం ఇవ్వడం భక్తి భావానికి నిదర్శనమన్నారు. జిన్‌కుంట అభివృద్ధికి అందరూ కలిసిమెలసి ఉండాలని సూచించారు. శ్రీనివాసులు, ఎంపీటీసీ లక్ష్మిదేవమ్మ, విష్ణుమూర్తి, రాజు, అశోక్‌రావు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



వెల్దండలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారులు, పోలీసులు



కొల్లాపూర్‌లో మాట్లాడుతున్న ఏడీఏ రవి

కొల్లాపూర్: పట్టణంలోని రైతు వేదిక భవనంలో గురువారం నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన విత్తన డీలర్లతో వ్యవసాయ శాఖ అధికారులు సమావేశం నిర్వహించారు. వ్యవసాయ శాఖ డీలర్లను ఉద్దేశించి ఏడీఏ రవి, ఎస్ఐ రాజు మాట్లాడారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై పీడీ యాక్టు ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలన్నారు. విక్రయాలకు సంబంధించిన వివరాలను స్టాక్ రిజిస్టార్, బిల్‌బుక్కులు, ఇన్వాయిస్‌లో నమోదు చేయాలని సూచించారు. సర్టిఫికేషన్ ఉన్న విత్తనాలను మాత్రమే విక్రయించాలన్నారు. ఏఓలు నాగరాజు, శ్రీరామ్, రమేష్ తదితరులున్నారు.

విత్తనాల ఎంపికలో నాణ్యత పాటించాలి..

వెల్దండ: వ్యవసాయ సాగుకు విత్తనాల విక్రయాల్లో నాణ్యత పాటించాలని మండల వ్యవసాయ అధికారిణి మంజుల, ఎస్ఐ శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో రైతు వేదికల్లో విత్తనాల, ఎరువుల విక్రయాల డీలర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మంజుల మాట్లాడారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలన్నారు. నకిలీ విత్తనాలను విక్రయిస్తే చట్టరీత్య చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం వెల్దండలోని వివిధ షాపులను తనిఖీ చేశారు.

డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయండి..

ఉప్పునుంతల: రైతులు లైసెన్స్ పొందిన డీలర్ల వద్దనే ప్రభుత్వం నుంచి ధ్రువీకరించిన కంపెనీలకు సంబంధించిన విత్తనాలనే కొనుగోలు చేయాలని మండల వ్యవసాయాధికారిణి సునీత, ఎస్ఐ శేఖర్‌గౌడ్ సూచించారు. గురువారం మండలంలోని వెల్టూరులోని ఫర్టిలైజర్, పెస్టిసీడ్స్ దుకాణాన్ని తనిఖీ చేశారు. విత్తనాలు, పురుగుమందు స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. తక్కువ ధరలకు వస్తున్నాయని నకిలీ విత్తనాలను కొనుగోలు చేసి సాగుచేస్తే పంట దిగుబడి ఆశించినంతగా రాక నష్టపోవాల్సి వస్తుందని తెలియజేశారు.

'అధికారులు ఎందుకు దృష్టి సారించలేదు'

బిజినేపల్లి: కేంద్రం నుంచి వచ్చిన అధికారులు డ్రగ్స్ తయారీ వ్యక్తులను అదుపులోకి తీసుకునేంత వరకు, కూత వేటు దూరంలో ఉన్న ఎక్సైజ్ శాఖ ఏం చేస్తుందని బీజేపీ నాగర్‌కర్నూల్ ఇన్‌చార్జ్ కొండా నాగేష్ ఆరోపించారు. గురువారం డ్రగ్స్ తయారీ కోళ్లఫారంను వారు సందర్శించి, విలేకరులతో మాట్లాడారు. సంవత్సరం కిందట డ్రగ్స్‌లో జైలుకు వెళ్లిన వ్యక్తిపై అధికారులు ఎందుకు దృష్టి సారించలేదని, నెలకు రూ.3 కోట్ల డ్రగ్స్ దందా జరుగుతుంటే అధికార యంత్రాగం ఏం చేస్తుందన్నారు. ఈ విషయమై ఆ శాఖ మంత్రి స్పందించకుంటే వారి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. బీజేపీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, కృపానందం, సుధాకర్, సాదిక్, వెంకటయ్య, రాఘవేందర్‌గౌడ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, మంత్రి రాజీనామా చేయాలి..

యువత ప్రాణాలతో బీఆర్‌ఎస్ పార్టీ చెలగాటమాడటం అలవాటుగా మారిందని, మండలంలో డ్రగ్స్ తయారీ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుని ఎమ్మెల్యే, మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ కొత్తపల్లి కుమార్ డిమాండ్ చేశారు. మండలంలో డ్రగ్స్ తయారు చేయడం దుర్మార్గమని, ఈ డ్రగ్స్ దందా వెనుకాల స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు హస్తం ఉందని అన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. బీఎస్పీ నాయకులు నాగన్న, చెన్నరాములు, పృథ్వీరాజ్, రాంచందర్, బాలనాగులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ రాష్ట్రస్థాయికి క్రీడాకారుల ఎంపిక



రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులతో వ్యాయామ ఉపాధ్యాయులు

తాడూరు: మూడు రోజులుగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన సీఎం కప్ పోటీల్లో మేడిపూర్‌కి చెందిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఎంపీడీఓ గంగమోహన్ గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన శ్రావణి, ఎస్ అనూష ఖోఖో పోటీలకు ఎంపిక కాగా.. సరిత షాట్‌పుట్‌లో ప్రథమ బహుమతి సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఈ నెల 28 నుంచి 30 వరకు హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో జరిగే సీఎం పోటీల్లో వారు పాల్గొంటారన్నారు. ఎంపికైన వారందరిని వ్యాయామ ఉపాధ్యాయులు సీతారాం నాయక్, ప్రకాశ్, కుర్మయ్య, పరశురాం, సర్పంచ్ ప్రమీళమ్మ, ఎంపీటీసీ సుజాత జైపాల్‌రెడ్డి అభినందించారు.

ఆలయాలను సందర్శించిన మాజీ ఎమ్మెల్యే



మహాదేవ్‌పూర్‌లో బొడ్రాయి ప్రతిష్ఠాపన పూజలో పాల్గొన్న వంశీకృష్ణ

బల్మూర్: మండలంలోని బాణాల, జన్‌కుంట, మహాదేవ్‌పూర్‌లోని ఆలయాలను గురువారం డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ నాయకులతో కలిసి ప్రత్యే పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మహాదేవ్‌పూర్‌లో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవంలో పాల్గొని పూజలు చేశారు. వెంకట్‌రెడ్డి, రాంప్రసాద్, మయూరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'అధికార దురహంకారానికి పాల్పడుతున్న గువ్వల'

అచ్చంపేట రూరల్: ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అధికార దురహంకారానికి పాల్పడుతున్నారని బీజేపీ నాయకుడు సతీష్‌మాదిగ ఆరోపించారు. గురువారం అచ్చంపేటలోని బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. దేవాలయాలను వేదికగా చేసుకుని రాజకీయ ప్రసంగాలు చేయడం సరైంది కాదన్నారు. బీజేపీ నాయకుల జోలికి వస్తే ఊరుకునేది లేదన్నారు. పులిజాల నుంచి చంద్రసాగర్ వరకు 5 కిలోమీటర్ల కేఎల్ఐ కాల్వ పొడిగింపు పను చేపట్టలేని ఎమ్మెల్యే ఉమామహేశ్వర, చెన్నకేశవ ప్రాజెక్టులను తీసుకొస్తానని చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. నియోజకవర్గ ప్రజలకు చెవిలో గులాబీ పూలు పెడుతున్నారని ఎద్దేవా చేశారు. గువ్వల బాలరాజు పతనం ప్రారంభమైందని, దొంగ వాగ్దానాలను నిగ్గు తేల్చుతామన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు నూకలు చెల్లాయన్నారు. బీజేపీ నాయకులు మంగ్యానాయక్, బాలాజీ, రేణయ్య, దేవేందర్‌రెడ్డి, అఖిల్ పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డుల పరిశీలన



కంపోస్ట్ షెడ్డును పరిశీలిస్తున్న అధికారులు

తాడూరు: పల్లెప్రగతి కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులను ఉపయోగంలోకి తీసుకురావాలని డీఎల్‌పీఓ రామ్మోహన్, ఎంపీడీఓ గంగమోహన్ కోరారు. గురువారం మండలంలోని సిర్సవాడ, ఇంద్రకల్ గ్రామాల్లోని డంపింగ్ యార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ సిబ్బందికి డంపింగ్ యార్డుల నిర్వహణపై అవగాహన కల్పించారు. అదే విధంగా పల్లెప్రకృతి వనాల్లో నాటిన మొక్కలు ఎండిపోకుండా చూడాలన్నారు. ప్రస్తుతం ఎండలు తీవ్రతరం అవుతున్నందున పల్లెప్రకృతి వనాల్లో మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

పేదలకు అన్నదానం



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న కర్ణాకర్‌రెడ్డి

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని సత్యసాయి మందిర్ ఆవరణలో లయన్స్ క్లబ్ ఆమనగల్ ద్వారా గురువారం పేదలకు అన్నదానం చేశారు. రాంరెడ్డి కంటి ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ దామోదర్‌రెడ్డి మనుమరాలు నిష్క జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు కర్ణాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, పాష, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



కోడేరు: మండల కేంద్రానికి చెందిన బాలపీరు గుండెపోటుతో మృతి చెందడంతో ఎస్‌వీ ఫౌండేషన్ చైర్మన్ నక్క వేణుగోపాల్ యాదవ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈయన వెంట దస్తగిరి తదితరులు ఉన్నారు.

వల్లభాపూర్‌లో..

లింగాల: మండల పరిధిలోని వల్లభాపూర్‌కు చెందిన తెలుగు లక్ష్మయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న అచ్చంపేట బీజేపీ నాయకులు సతీష్‌మాదిగ గురువారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేలు, 50 కిలోల బియ్యం అందజేశారు. సలేశ్వరం, మంగ్యానాయక్, పెద్దయ్య పాల్గొన్నారు.

'రాష్ట్రపతిని పిలవకపోవడం అవమానించడమే'



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు బాల్‌నర్సింహ

నాగర్‌కర్నూల్‌రూరల్: దేశ ప్రథమ పౌరురాలైన రాష్ట్రపతి ద్రౌపది ముర్మును పార్లమెంట్ ప్రారంభోత్సవానికి పిలవకుండా అవమానించారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాల్‌నర్సింహ అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్య దేశంలో దేశ ప్రథమ పౌరుడికి పార్లమెంట్‌ను ప్రారంభించే అర్హత ఉంటుందని, అది ధిక్కరించి ప్రధాని నరేంద్రమోడీ ప్రారంభించడం సరికాదన్నారు. అప్పుడున్న ప్రధాని ప్రజాస్వామ్య స్ఫూర్తితో స్వాతంత్ర్యం అనంతరం జరిగిన మొట్టమొదటి ఎన్నికల్లో ఎవరు ఎక్కువ మెజారిటీతో గెలిస్తే వారిచేత పార్లమెంట్ భవనాన్ని ప్రారంభింపజేస్తామని ఆనాటి ప్రధాని నెహ్రూ ప్రకటించారని గుర్తుచేశారు. తెలంగాణ అమరజీవి కమ్యూనిస్టు యోధుడు తెలంగాణ రైతాంగ స్థాయిలో పోరాటం నిర్వహించిన నాయకుడు రావినారాయణరెడ్డితో అప్పటి పార్లమెంట్ భవనాన్ని ప్రారంభించారని చెప్పారు. మోడీ ప్రధాని అయ్యాక సొంత డబ్బా కొట్టుకోవడం తప్ప ప్రజాస్వామ్యానికి విలువ తెచ్చే ఏ కార్యక్రమం చేపట్టడం లేదని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బీజేపీకి కాలం చెల్లిందని కర్ణాటక ఎన్నికల్లో రుజువైందని అన్నారు. సీపీఐ జాతీయ పార్టీ పిలుపులో భాగంగా ఏప్రిల్ 17 నుంచి మే 12 వరకు బీజేపీ హటావో.. దేశ్‌కో బచావో అన్న నినాదంతో ఇంటింటికీ సీపీఐ పాదయాత్రను కొనసాగించిందని చెప్పారు. జూన్ 4న కొత్త గూడెంలో సీపీఐ ప్రజాగర్జన పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ఆనంద్, కేశవులుగౌడ్, ఇందిర, విజయుడు, కృష్ణాజీ, వెంకటయ్య, లక్ష్మీపతి, రవీందర్, శంకర్‌గౌడ్, శివుడు, కిరణ్‌కుమార్, శివశంకర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సమావేశాన్ని విజయవంతం చేయండి

వెల్దండ: కల్వకుర్తి నియోజకవర్గ కేంద్రంలోని పద్మశాలి భవనంలో ఈ నెల 26న నిర్వహించే బీజేపీ జిల్లా కార్యవర్గాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రామస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేసేలా కార్యకర్తలు పాటుపడాలన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జాతీయ బీసీ మాజీ కమిషన్ సభ్యులు ఆచారి, జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావుతో పాటు ముఖ్యనేతలు హాజరవుతున్నట్లు చెప్పారు.

నాయకుల సంతాపం

కోడేరు: మండల కేంద్రానికి చెందిన బాలపీరు(25) బుధవారం కల్వకోల్‌లో బంధువుల వివాహానికి వెళ్లాడు. ఉదయం ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కొల్లాపూర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు చెప్పడంతో నాగర్‌కర్నూల్‌కు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమాధ్యం లోనే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ రాంమోహన్‌రావు, అబ్దుల్‌కరీం, దూరెడ్డి రఘువర్ధన్‌రెడ్డి, సర్పంచ్ వెంకటస్వామి, జగన్ మోహన్‌రెడ్డి తదితరులు మృతదేహానికి పూలమాలు వేసి నివాళి అర్పించారు.

'పాలమూరు' ప్రాజెక్టును పూర్తిచేయాలి



మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

నాగర్‌కర్నూల్ రూరల్: ఉమ్మడి జిల్లాకు వరప్రదాయిని కానున్న పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు పనులను వెంటనే పూర్తి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ అన్నారు. గురువారం సీపీఎం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నిర్లక్ష్యానికి గురవుతుందని, ప్రభుత్వం సక్రమంగా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రూ.45 వేల కోట్లతో ప్రారంభించిన ఈ పథకానికి సరైన నిధులు కేటాయించకపోవడం వల్లే పనుల్లో వేగం పెరగడం లేదని విమర్శించారు. వట్టెం రిజర్వాయర్ పనులు 50 శాతం కూడా పూర్తి కాలేదని పంపుహౌస్ నిర్మించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. జిల్లాలో అచ్చంపేట, కొల్లాపూర్ ప్రాంతాల్లో ఉన్న పోడు భూములకు వెంటనే పట్టాలివ్వాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి పర్వతాలు, కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు, ఆంజనేయులు, ఎం.శ్రీనివాసులు, మల్లేశ్, నిర్మల, బాలస్వామి, కాశన్న, దశరథం తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి



బహుమతులు అందజేస్తున్న రాఘవేందర్‌రెడ్డి

కల్వకుర్తి రూరల్: పోటీల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించినప్పుడే ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశాలు ఉంటాయని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి చెప్పారు. మండలంలోని పంజుగూలలో నిర్వహించిన క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మొదటి స్థానంలో నిలిచిన జట్టుకు రూ.15 వేలు, రెండో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10 వేల చెక్కులను, జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో అనిల్‌గౌడ్, రమేష్, రాములు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మహానాడును విజయవంతం చేయండి

కల్వకుర్తి రూరల్: టీడీపీ ఆధ్వర్యంలో ఈ నెల 27, 28 తేదీల్లో ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రిలో నిర్వహించే మహానాడును విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ యాదిలాల్ కోరారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. కల్వకుర్తి నియోజకవర్గం నుంచి టీడీపీ కార్యకర్తలు పెద్దఎత్తున రాజమండ్రి తరిలేందుకు సిద్ధం కావాలన్నారు. సమావేశంలో మల్లయ్య, సత్యనారాయణ, పద్మనాభం, భాస్కర్, కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీఓఏల సమ్మె



తెలకపల్లిలో నినాదాలు చేస్తున్న వీఓఏలు

తెలకపల్లి: మండల కేంద్రంలో ఐకేపీలో పనిచేస్తున్న వీఓఏలు చేస్తున్న నిరవధిక సమ్మె గురువారానికి 39వ రోజుకు చేరింది. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, నెలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, అర్హులైన వారిని సీసీలుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని వీఓఏలు డిమాండ్ చేశారు.

సమస్యలపై స్పందించకుంటే ఉద్యమిస్తాం..

బల్మూర్: ఐకేపీ వీఓఏలు 39 రోజులుగా తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటని అచ్చంపేట బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సతీష్‌మాదిగ విమర్శించారు. గురువారం మండల కేంద్రంలోని ఐకేపీ వీఓఏల సమ్మె శిబిరాన్ని సందర్శించి వారికి మద్దతు తెలిపారు.

గాంధీభవన్ ముట్టడికి యాదవులు

లింగాల: పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను, గొల్ల, కురుమలను కించపర్చేలా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ.. గురువారం గాంధీభవన్ ముట్టడికి యాదవ సంఘం పిలుపునివ్వటంతో మండలం నుంచి భారీ సంఖ్యలో యాదవులు తరలివెళ్లారు. మల్లేష్ యాదవ్, లక్ష్మణ్‌యాదవ్ తదితరులు తరలివెళ్లారు.

మహాసభకు తరలిన కాంగ్రెస్ నాయకులు

తాడూరు: సీఎల్పీ నాయకుడు మల్లు భట్టివిక్రమార్క ప్రారంభించిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా జడ్చర్లలో నిర్వహించిన మహాసభకు మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు గురువారం తరలివెళ్లారు. పీసీసీ సభ్యుడు బాలగౌడ్, లక్ష్మయ్య, చంటి, శ్రీశైలం, భాస్కర్ తదితరులు ఉన్నారు.